


వాకిట్లోకొచ్చి నిలబడాలంటే చిరాగ్గా వుంది. ఈ వీధినిండా కుక్కలే. ఊరకుక్కలు — రాత్రుళ్ళు ఈ వీధి గుండా నడవటం ఎంత కష్టమో — ఉదయం పూట. అందునా ఈ కార్తెలో — అంతే కష్టం!

ఆకాశం దట్టంగా మేఘావృతమైంది. ఏ క్షణం అయినా వర్షం కురవొచ్చు. అయిష్టంగానే వీధి వైపుకు దృష్టి సారించిన నాకు ఏ దృశ్యం చూడకూడదని భయపడుతున్నానో అదే కన్పించింది. పిల్లలు చుట్టూ చేరి ఏదో అనుకుని నవ్వుకుంటున్నారు. రాళ్ళు తీసుకుని కొడ్తున్నారు. ఆ రెండు కుక్కలూ మూల్గుతున్నాయి. విడిపోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాయి.

వాటి కళ్ళలోకి చూశాను. అవి సిగ్గుపడ్తున్నట్టే అనిపించింది. బాధపడ్తున్నట్లు కళ్ళు దించుకుని వున్నాయి. సూటిగా పిల్లల కళ్ళలోకి చూడలేకపోతున్నాయి. నాకెందుకో చప్పున అవంటే జాలేసింది.

"ఛీ — ఛీ — పాడు కుక్కలు"

వదిన గొంతు విన్పించి వెనక్కి తిరిగి చూశాను.

వదిన అందమైన మొహం నిండా అసహ్యం నింపుకుని ఆ వైపు కాకుండా మరోవైపుకు చూస్తోంది.

నేనూ అటు చూశాను.

తలవొంచుకుని మా ఇంటి వైపుకు వస్తోంది సీత.

"ఇంకా పూర్తిగా తెల్లారనే లేదు బయల్దేరింది ఆడ కుక్క — ఛీ — కుక్క బుద్ధి"

సీత మా గేట్ తీసుకుని లోపలికి వస్తున్న దల్లా ఒక్కసారిగా ఆగిపోయింది.

వదిన కోపంగా నా వైపు — అసహ్యంగా సీత వైపు చూసి లోపలి కెళ్ళిపోయింది.

"రండి — ఆగిపోయారేం" మనసులోని భావాల్ని బలవంతంగా నొక్కి పట్టి ఏమీ జరగనట్టే ఆహ్వానించాను.

ఓ క్షణం సంశయించి — ఏదో నిర్ణయించుకున్న దానిలా గేట్ లోపలికి అడుగు పెట్టింది.

ఆవిడ కళ్ళు కూడా ఆకాశంలానే వున్నాయి. ఎప్పుడైనా వర్షించడానికి తయారుగా —

నా రూంలోకి తీసుకెళ్ళి కూచోబెట్టాను.

నిశ్శబ్దం కొన్ని సమయాల్లో ఎంత దుర్భరంగా — బరువుగా వుంటుందో అనుభవిస్తూ చాలాసేపు గడిపాం.

పక్క గది నుంచి మా వదిన గొంతు విన్పిస్తూనే వుంది.

"మా రోజుల్లో మగ పిల్లలకు భయపడి ఆడపిల్లల్ని కట్టుదిట్టం చేసే వాళ్ళు. ఇప్పుడు అన్నీ మాయదారి రోజులు వచ్చాయి. మగపిల్లల్ని జాగ్రత్త చేసుకోవాల్సి వస్తోంది. సంసారుల కొంపల్లోకి వ్యభిచారులు నేరుగా — దర్జాగా రాగలుగుతున్నారంటే — హవ్వ — మా పరువు మురిక్కాలవలో కల్సినట్టే."

సీత కళ్ళనిండా నీళ్ళు ఉబికి వచ్చేశాయి.

"నేను వెళ్తాను" లేచి నిలబడింది. ఆవిడ కాళ్ళు కొద్దిగా వణుకుతున్నాయి.

"ఉదయాన్నే మిమ్మల్ని చూడాలనిపించింది. వచ్చేశాను" నొచ్చుకుంటున్నట్లు, సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్లు చెప్పింది సీత.

"మనిద్దరికీ తెల్సిన విషయమేగా — వదిన ఎప్పుడూ అంతే. అందులో మీ మీది అయిష్టత కంటే నా మీది ఆప్యాయతే ఎక్కువగా వుంటుంది. నేనెక్కడ ఏమైపోతానో నన్న ఆందోళనే కన్పిస్తుంది. అందులో నాకు అమ్మ ప్రేమలా చల్లని వాత్సల్యం వదినది. మీరేం నొచ్చుకోకండి" అన్నాను.

తను ఇక్కడ ఎక్కువ సేపు వుంటే వదిన తిట్లన్నీ పడాల్సి వస్తుంది. అందుకే గడపవరకూ నడిచాను.

"సీతా — మీరు రాగలిగితే మనం ఎప్పుడూ కల్సుకునే చోటికి రండి — మరో గంటలో నేను అక్కడ మీ కోసం వెయిట్ చేస్తుంటాను."

సీత మొహంలో ఆనందం స్పష్టంగా కన్పించింది.

"మీరు వస్తారంటే — గంటదాకా టైం ఎందుకు — ఈ క్షణమే అక్కడకు వెళ్ళి మీ కోసం ఎదురు చూస్తుంటాను" అంది.

"మీరు అలసినట్లు కన్పిస్తున్నారు. కళ్ళు కూడా ఎర్రగా వున్నాయి. ఓ గంట విశ్రాంతి తీసుకుని రావచ్చని."

చివ్వున తలయెత్తి చూసింది సీత. ఆమె కళ్ళలో ఆత్మ న్యూనతా భావం — అపరాధం చేసినట్టు.

"మీతో గడిపే ఆ కొన్ని నిముషాలే నా జీవితంలో అతి విలువైనవి. వాటి కోసం ఏమైనా త్యాగం చేస్తాను."

"ఛీ. ఈ ముదనష్టపు కుక్కలు యింటి ముందు నుంచి కదలనే కదలవు."

వదిన బైటికొచ్చి కాల్చేసేలా ఓసారి మా ఇద్దరి వైపు చూసి లోపలికెళ్ళింది.

సీత తలవొంచుకుని వేగంగా వెళ్ళిపోయింది.

** ** **

సముద్రం సీత కనురెప్పల మధ్య చిక్కుకున్నట్టు — ఏడుస్తోంది.

దూరంగా బెస్త పిల్లలు గోచీలతో ఆడుకుంటున్నారు.

సన్నగా వెక్కిళ్ళు విన్పిస్తున్నాయి. సముద్రపు అంచు విరిగిపడే శబ్దానికి తాళంలా —



సీత గతం గురించి మొదటిసారి నాకు తెల్పినప్పుడు కూడా ఇలానే ఏడ్చింది.

ఆ రోజు — ఆ గదిలో — మేమిద్దరం. చీకటిలో — తను కుర్చీలో — నాకు అందేంత దూరంలో —

తనని దగ్గిరకు లాక్కుని, పొదివి పట్టుకుని "నాకు మీరంటే అసహ్యం లేదు. మీలాంటి వాళ్ళంటే నాకు జాలి" అనాలనుకున్నాను.

నాకు తెలుసు సీతకు జాలి అంటే ఎంత అసహ్యమో—

"జాలి పడటం దేనికి — నాక్కావాల్సింది జాలి కాదు. ఓ స్నేహ హస్తం —

ఓ మృదువైన పలుకు — ఓ తీయటి మనసు" అని వ్యాఘ్రిలా విజృంభిస్తుంది.

సీత నాకు పరిచయమైన నాటి సంఘటనలు గుర్తొచ్చాయి.

డిగ్రీ చేస్తూనే చిన్న పిల్లలకు ట్యూషన్స్ చెప్పేవాడిని. ఆర్థికంగా మా అన్నయ్య మీద ఎక్కువగా ఆధారపడకుండా వుండొచ్చన్న ఆలోచనతో పాటు —. చిన్న పిల్లలంటే నాకున్న ఆపేక్ష కూడా ఇందుకు కారణం.

ఓ రోజు పాఠం చెప్తూ — తలయెత్తి చూసేసరికి 'గుమ్మానికి ఆనుకుని ఓ ఇరవై యేళ్ళ అమ్మాయి.

నా వైపే ఆరాధనగా చూస్తోంది.

నేను తలయెత్తగానే — తొట్రుపడి — సంబాళించుకుని — "నాకూ నేర్పరూ" అని అడిగింది పసిపిల్లలా ... ఆ అమ్మాయి కళ్ళలో ఓ రకమైన ఆకర్షణ వుంది — పసిపిల్లల బోసి నవ్వులో వుండే అమాయకత్వంలోని ఆకర్షణ.


## కవిత్వపు వానలో...

హృదయం రణమైనప్పుడూ,
రణమే జీవితంగా మారినప్పుడూ
సౌందర్య స్వప్నాలు చిట్లి
సన్నటి గాజుపొడి మీద తేనెపాకం జారినట్లు
కాలం గొంతు నొక్కుకుపోయి గబ్బిలమై వేలాడే దశలో
ఎక్కడిదీ వెలుతురు నేత్రం!
మరో ప్రపంచపు అరలోకి
మానసాన్ని తోడ్కొని పోయి
ఇంత చిరు రెమ్మల ఊయలపై కూర్చోపెడుతుందేం
వ్యక్తీకరించలేని బాధా సముద్రాలకి
వెన్నెల సాంబ్రాణి గంధాల నద్దుతుందేం
చితచితమని బురదలో తిరిగే వానపాము జీవితానికి
మెరుపు మృదంగాల మేఘ సమీరాల మయూర నృత్యం నేర్పుతుందేం
లోలోపలి ఎత్తులకీ శబ్దం ఎరుగని సాంద్రతలకీ నిచ్చెన వేసి
మనిషితనాన్ని యిట్లా ఎగదోస్తుందేం
మండిపోవడంలోంచి మార్గదర్శకంగా మలచే
చైతన్యపు ఆ ఉలి లిపి పేరు
మొట్టమొదటగా ఎవరు స్పర్శించారో

ఉద్విగ్న భావోద్రేకాల ఊపులో గిరగిరలై
పచ్చికమీద కాసేపు విరిసే కెంపు కాశీరత్నం పువ్వుకోసం
గుండెని పారవేసుకునే మహోలాలసా మోహంలోనూ
వెంటనంటి, వెన్నులో జలపాతంలా పులకలెత్తిస్తుందేం

ఇంతటి రసచలనాన్నీ, జ్వలనాన్నీ ఋచ్చి
పొదరసంలా పురుగులెత్తించే
కవిత్వాకాశపు గాలిపటానికి
సూత్రపు పట్టుగా ఈ జీవితాన్నిచ్చుకోవడం తెలిసుంటే
ఎంత బాగుంటుంది?

—ఆదూరి సత్యవతీదేవి



"లోపలికి రండి" అన్నాను.

"మీరు మైలపడ్తారేమో" ఫక్కుమని నవ్వింది. వినీలాకాశంలో విహంగం విహరిస్తే పడే ఆనందం లాంటి నవ్వు - స్వేచ్ఛలోని, స్వాతంత్ర్యంలోని మత్తంతా నింపుకున్న నవ్వు.

"ఏం అలా అన్నారు?" లోపలి కొచ్చిన తర్వాత అన్నాను.

"దేవాలయాల్లోకి ఇప్పటి వరకూ అడుగు పెట్టలేదు నేను అందుకు" ఆ కళ్ళలో ఓ క్షణం బాధ మెరిసి మాయమైంది.

సీతకు కూడా చదువు చెప్పటం ప్రారంభించాను. చాలా బుద్ధిగా - శ్రద్ధగా నేర్చుకునే సీతంటే నాకు ఇష్టం ఏర్పడింది.

"ఇన్నాళ్ళూ ఎందుకు చదువుకోలేదు?" అని అడిగానో రోజు.

"టైం ఎక్కడిదీ"

"మరి ఇప్పుడు చదువుకోవాలని ఎందుకను కున్నారు?"

"మిమ్మల్ని చూశాక"

"అదేం జవాబు?"

"ఏం! కొన్ని పువ్వుల్ని చూస్తే ముద్దాడాలనిపిస్తుంది. కొన్నిటిని తాకాల నిపిస్తుంది. కొన్నిటిని జడలో తురుముకోవాలనిపిస్తుంది. కొన్నిటిని దూరం నించే చూడాలనిపిస్తుంది. కొన్నిటికి దూరంగా పోవాలనిపిస్తుంది. మిమ్మల్ని చూశాక మీకు దగ్గరగా వుండాలనిపించింది. అందుకు"

కొన్నిసార్లు చదువు చెప్తున్నప్పుడు సైతం సీత నిద్ర మత్తుతో తూలుతో వుండేది.

"కళ్ళు ఎర్రగా వున్నాయి. రాత్రి నిద్ర పోలేదా?" అని అడిగానో సారి.

"నేనునిశాచరిని - రాత్రుళ్ళు నాకు నిద్ర పట్టదు"

"ఏం"

"అంతే. అదో శాపం - రాత్రంతా మేల్కొనే వుండాలి"

"డాక్టర్‌కి చూపించలేక పోయారా"

బాధగా నవ్వింది. "అందుకే మీరంటే ఇష్టం నాకు. ఏ పాపమూ తెలియని గర్భగుడిలోని దేవుడిలాంటి మీరు ... నేనెంత పుణ్యం చేసుకున్నానో - మీ పరిచయం కలిగింది"

ఓ రోజు సీతకు పాఠం చెబుతున్నప్పుడు నా స్నేహితుడొకడు వచ్చాడు. సీత అతన్ని చూడగానే లేచి వెళ్ళిపోయింది.

"ఈ అమ్మాయి ఇక్కడికెలా వచ్చింది?" అని అడిగాడు కుతూహలంగా.

"నా స్టూడెంట్" అన్నాను.

"నీకు కాలేజీలో బుద్ధిమంతుడని పేరుంది. మీది సత్సాంప్రదాయమైన వంశం - మీ అన్న గారి పేరు మట్టిలో కలిపేస్తావా" అన్నాడు.

ఆశ్చర్యపోయాను నేను.

"ఆ అమ్మాయి ఎవరనుకుంటున్నావు! వ్యభిచారి - రోజూ రాత్రుళ్ళు లాడ్జిలోనే కాపురం వుంటుంది."

"ఛ... అంత అమాయకమైన అమ్మాయి మీద అలాంటి నింద వేయడం..."

"నిజం ... నేను కూడా ఆ అమ్మాయితో రెండు మూడు సార్లు గడిపాను. అందుకే-గమనించావా-నన్ను చూడగానే మొఖం చాటేసి వెళ్ళిపోయింది" అన్నాడు.

"నువ్వు నవ్వులపాలు కావటమే కాకుండా మీ అన్నయ్యపరువు మర్యాదలుకూడా చెడిపోతాయి. ఆ అమ్మాయితో ఇకనైనా జాగ్రత్తగా వుండు" అని చెప్పి అతను వెళ్ళిపోయాడు.

ఈ మాటలన్నీ వదిన కూడా వింది. ఆ రోజు నుంచే సీతను చూస్తే చాలు అసహ్యంగా మాట్లాడడం ప్రారంభించింది.

రెండో రోజు సీత రాలేదు. మూడో రోజు కూడా రాలేదు.

నాలో అశాంతి. నేనే బయల్దేరాను. సీత ఇంటిని వెదుక్కుంటూ - తీరా అక్కడికెళ్ళాక

తెలిసింది రెండ్రోజుల క్రితం సీత ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయిందని.

ఓ వారం పూరంతా వెదికి - విసిగి పోయాక - నా ఫ్రెండ్ చెప్పిన లాడ్జికెళ్ళి సీత గురించి వాకబుచేశాను.

ఆ రాత్రి - ఆ లాడ్జి రూంలో సీత నాకు అందేంత దూరంలో కూచుంది.

''నాకు తెలుసు - మీారిలాంటి పని ఏదో చేస్తారని భయపడ్తూనే వున్నాను. ఎందుకిలా చేశారు! ఇంత అపవిత్రమైన స్థలానికి - నాలాంటి పతిత కోసం మీారెందుకు ప్రయాసపడి వచ్చారు'' సీత కళ్ళలో సుళ్ళు తిరిగే బాధ.

''చదువుకోడానికి ఎందుకు రావడం లేదు! అంత అకస్మాత్తుగా ఎందుకు మానేశారు? నేనెప్పుడూ మీా మనసు నొచ్చుకునేలా ఏమీా ప్రవర్తించలేదు కదా - ఎందుకు ఇల్లు కూడా మారిపోయారు. నాకు దగ్గిరగా వుండాలనుకుంటున్నానని చెప్పిన మీారు - ఇలా నా నుంచి దూరంగా పారిపోయి ఎందుకు వెళ్ళిపోయారు'' అని అడిగాను.

''నిజమే - మీా సాన్నిహిత్యం కోరుకుని మీాకు దగ్గరైనాను. జీవితంలో ప్రతిక్షణం తిరస్కారాన్ని, అసహ్యాన్ని మాత్రమే అనుభవించిన నేను మీా నుండి కూడా అదే పొందాల్సి వస్తుందేమోన్న భయంతో మీా నుండి దూరంగా వచ్చేశాను'' తల మోకాళ్ళ మధ్య ఆనించి ఏడుస్తోంది సీత.

దగ్గరకు తీసుకుని లాలించాలనిపించింది.

''మీారు నా దగ్గిరకు ఓ విద్యార్థిలా వచ్చారు. మీా వ్యక్తిగత జీవితంతో నాకు ప్రమేయం లేదు.''

''మరి నేను రాకపోతే వెతుక్కుంటూ మీారు రాకూడని ప్రదేశానికి ఎందుకు వచ్చారు?''

ఓ క్షణం నా వైపు చూసి అంత బాధలోనూ అల్లరిగా నవ్వింది.

''మీాకూ తెలుసు, నేను మీా స్నేహాన్ని అర్థించి వచ్చానని! అమృత హృదయం కల మీారు మీా గొప్ప మనసుతో నాకు కొన్నాళ్ళయినా మరిచి పోలేని స్నేహ మాధుర్యాన్ని ఇచ్చారు. మీారు దేవుడిలాంటి వారు. మీాకు మైలపడడం అంటే ఏమిటో కూడా తెలియదు. కానీ ఈ మనుషులు అలా కాదు కదా - వీళ్ళు మృగాలు. మీారు నాతో సన్నిహితంగా వుంటే ఈ మనుషులు మీా మీాద బురద చల్లుతారు. నా పాదం మోపితే నా దేవుడు మైలపడ్తాడని తెలిసీ అడుగు పెట్టటం - ఆ దేవుడిని చూడకుండా వుండలేని నా బలహీనతో లేక అతని సాన్నిధ్యంలో దొరికే ఆత్మశాంతి పొందాలన్న స్వార్థమో తెలియదు. నన్ను క్షమించండి. ఇంకెప్పుడూ మీా జీవితంలోకి రాను.'' సీత నా పాదాలను పట్టుకుని విలపిస్తోంది. ఆ కన్నీళ్ళు నా పాదాలను కడిగి పునీతం చేస్తున్నాయి.

''మీాది ఎంత గొప్ప సంస్కారం! చివరికి ఎందుకిలాంటి బ్రతుకు బ్రతుకుతున్నావని కూడా మీారు అడగలేదు. ఏం చేయను చెప్పండి. నా చిన్నప్పుడే నన్ను ఎత్తుకొచ్చి ఎవరికో అమ్మేశాడో దుర్మార్గుడు. నా జీవితం ఎంత హేయమైనదో - నికృష్టమైనదో అవగాహ నకు వచ్చేలోపలే ఏ పాపాత్ముడి వల్లనో నాకో కొడుకు పుట్టాడు. చూస్తూ చూస్తూ ఆ పసి కందుని చంపుకోనూ లేను. వాణ్ణి అనాథను చేసి నేను చావనూ లేను. అందుకే జీవచ్ఛవంలా అయినా ఇలాగే బ్రతుకుతున్నాను. ఇటువంటి హీనమైన, నికృష్టమైన జీవితంలో మీా పరిచయం ఒక్కటే నేను పదిలంగా గుండెల్లో దాచుకోగల తీయటి అనుభూతి''

సీతకు ఆ క్షణాల్లోనే స్థిరంగా చెప్పాను- సంఘం ఏమనుకున్నా లోకం ఏమైపోయినా పర్లేదు - తన స్నేహం నాకు కావాలని. అప్పటి నుండీ సీత మరలా మా ఇంటికి రావడం ప్రారంభించింది. వదిన ఎన్ని తిట్టినా, ఎంత అవమానించినా, భరించి నా కోసం సహించే సీతంటే నాకు ఇష్టం అధికం కాసాగింది.

ఆలోచనల్లోంచి బైటపడి సీత వైపు చూశాను. చెంపకు చేయి ఆనించి తదేకంగా నా వైపే చూస్తోంది.

''ఏమిటీ అలా చూస్తున్నారు?'' అన్నాను.

''అంత దీర్ఘంగా నన్ను ఒంటరిగా వదిలేసి ఆలోచిస్తున్నది ఎవరి గురించా అని''

''మీ గురించే''

''నా గురించి ఆలోచించడానికేముంటుంది! గులాబీ పూల గురించి ఆలోచించే వాళ్ళుంటారు కానీ గరిక పూల వూసు ఎవరి క్కావాలి. ఏ విలువా లేని నా గురించి ఆలోచించే కంటే మీ భవిష్యత్తు గురించి ఆలోచించండి.''

సీతకెప్పుడూ నా భవిష్యత్తు గొడవే. డిగ్రీ పూర్తయిన క్షణం నుంచి పోరుతూనే వుంది. ఇంకా చదవాలట. నేను ఉద్యోగాల వేటలో పడటం తనకు ససేమిరా ఇష్టం లేదు.

''మీ అన్నయ్య సంపాదన మీద ఆధారపడి చదవటం ఇష్టం లేకపోతే చెప్పండి. నేను చదివిస్తాను. శరీరాన్ని అమ్ముకుని సంపాదించిన దైనా మీ స్నేహంతో పవిత్రమైన మనసుతో ఇస్తాను కదా— భక్తిగా భగవంతుడికి అర్పించే నైవేద్యంలా'' అంటుంది.


నాకింకా చదవాలని లేదు. ఏదో ఒక ఉద్యోగంలో చేరి నా కాళ్ళ మీద నేను నిలబడాలని వుంది.

''మొన్ననే హైదరాబాద్‌లో ఓ ఇంటర్వ్యూకెళ్ళొచ్చాను కదా. బాగానే చేశాను. ఆ ఉద్యోగం వస్తుందన్న నమ్మకం వుంది.''

సీత నించి జవాబు రాకపోతే తలతిప్పి చూశాను. ఎటో క్షితిజం వైపు చూస్తోంది.

''నాకు ఉద్యోగం రావటం మీకు సంతోషం కలిగించదా'' అని అడిగాను.

''దానికన్నా మీరు నాకు దూరంగా వెళ్ళిపోతారన్న బాధే ఎక్కువగా వుంది'' సీత పెద్ద



పెద్ద కళ్ళలో నీరు! గుండ్రటి నీటి బిందువులు బరువుగా కిందికి జారాయి.

నేను ఏ సమాధానమూ ఇవ్వలేదు.

మరికొంత సేపు కూచున్నాక "వెళ్దామా" అని అడిగాను. సీత మౌనంగా తల వూపింది.

* * *

ఇంటర్వ్యూ కెళ్ళి రెండు నెలలు గడిచినా ఉద్యోగం ఏదీ రాలేదు.

డిగ్రీ పట్టా చేతికి వచ్చి సంవత్సరం దాటింది.

నాలో అసహనం—నిరాశ

ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టటం లేదు. చాలా సేపు చదువుకుంటూ గడిపాను.

వదిన రెండు సార్లు గదిలో కొచ్చి పలకరించి పోయింది. "నిద్ర రావటం లేదా—కూచుని కబుర్లు చెప్పమంటావా" అని.

వదినకు నేనంటే ఎంతిష్టమో—అన్నయ్య క్యాంప్ కెళ్ళి వారం దాటింది. వదిన క్కూడా నిద్ర పట్టినట్టు లేదు. ఆమె గదిలో లైట్ ఇంకా వెలుగుతూనే వుంది.

రాత్రి ఒంటిగంట దాటాక ఎపుడో మాగన్నుగా నిద్ర పట్టింది. అందులో కల. వీధినిండా కుక్కలు. జతలు—జతలుగా. ఓ ఆడకుక్క నా మీద పడి—నన్ను కిందికి దొర్లించి—కొరుకుతోంది. రక్కుతోంది. భయంతో ఒక్కసారిగా మెలకువ వచ్చింది. నా మీద ఓ స్త్రీ వుందన్న విషయం అర్థం కావడానికి కొన్ని క్షణాలు పట్టింది.

వదిన—నేను అమ్మలా ఆరాధించిన వదిన—నేను పోగొట్టుకున్న తల్లి వాత్సల్యం అందిస్తున్న దేవత అని నమ్మిన వదిన—ఆమె మీద తనకున్న అంతులేని నమ్మకంతో నిశ్చింతగా క్యాంప్‌లకెళ్ళిపోయే మంచి మనిషి అన్నయ్య భార్య—వదిన...


నన్ను గట్టిగా కౌగలించుకుని ఏదేదో అంటోంది.

"ఇన్నిన్నాళ్ళూ అంత ప్రేమగా చూస్తున్నా, నీకు నా మనసులోని మాట అర్థం కాలేదు. ఎన్నాళ్ళని ఎదురు చూడాలి నీ పొందుకోసం" అంటూ పలవరిస్తోంది. తను సగం వివస్త్రగా వుంది.

ఒక్కసారిగా విదిలించుకున్నాను.

దెబ్బతిన్న ఆడపులిలా చూస్తోంది వదిన. ఆవిడ గుండెలు కోపంతో, ఆవేశంతో, అవమానంతో ఎగిరెగిరి పడ్తున్నాయి.

"పది మంది దగ్గరా పడుకుని కుళ్ళిపోయిన వేశ్యలే నీకు బావుంటారనుకుంటా" ఆపకుండా తిడ్తూనే వుంది.




టైం చూసుకున్నాను. నాలుగ్గంటలు కావస్తోంది. స్నానం చేసి బట్టలు వేసుకున్నాను. సూట్ కేస్ నిండా బట్టలు సర్దుకున్నాను.

ఆవిడతో వెళ్తున్నట్టు కూడా చెప్పలేదు. గడపదాటి వస్తున్నప్పుడు చూశాను. గడప మీద రక్తం మరకలు...రాత్రి గేట్ వేయడం మర్చిపోయి నట్లుంది. బహుశా కుక్కలు లోపలికి వచ్చి గడప దగ్గిర...

అసహ్యం వేయలేదు నాకు.

తుంపరగా వర్షం పడుతోంది. గేటు మూసి, రోడ్డు మీదికి వచ్చాను.

ఆ వీధి అంటేనే అసహ్యం వేస్తోంది. మొగుడు ఆఫీస్‌కి వెళ్ళిన వెంటనే పైట కావాలని జార్చి అర్థవంతంగా నవ్వే పక్కింటి మహాలక్ష్మి—పెళ్ళై ఆరు నెలలైనా నిండని, మేడ పైనించి సైగలు చేసే ఎదురింటి సావిత్రి, భర్తని క్యాంప్‌కి పంపించి బరితెగించి ప్రవర్తించిన ఈవిడ ఛీ—వీళ్ళకన్నా ఆ కుక్కలే నయం. అవి చేస్తున్న పని తప్పో ఒప్పో తెలియకున్నా లజ్జగా, సిగ్గుగా తల వొంచుకునే వాటికీ—తప్పని తెలిసీ, పవిత్రమైన వివాహ బంధానికి మచ్చ అని తెలిసీ—ఎవరూ చూడటం లేదన్న ధీమాతో అసహ్యమైన పాపపు పనులు చేసే వీళ్ళకూ ఎంత తేడా! వీళ్ళకన్నా వేశ్యలే నయం. నిజాయితీగా శరీరాన్ని అమ్ముకుని పొట్ట పోసుకుంటారు.

నేరుగా సీత ఇంటికి వెళ్ళాను. మంచం మీద బాబు అమాయకంగా నిద్రపోతున్నాడు.

హైదరాబాద్ వెళ్తున్నానని చెప్పాను. ఎర్ర గులాబీల్లా వున్న సీత కళ్ళలో మంచు బిందువుల్లా నీళ్ళు.

"ఏదైనా ఉద్యోగం వచ్చే వరకైనా ఆగవచ్చు కదా" అంది.

"నా మీద నాకు నమ్మకం వుంది. ఎపుడో వచ్చే ఉద్యోగం కోసం ఇక్కడ కూచుని ఎదురు చూసేబదులు—అక్కడికే వెళ్ళి ఉద్యోగం వెతుక్కోవడం మంచిదనిపిస్తూంది. పది మందికి ట్యూషన్లు చెప్పుకుని అయినా బ్రతగ్గలిగినపుడు మరొకరి మీద ఆధారపడి వుండటం అవివేకం."

"మీరు ఇంత అకస్మాత్తుగా ఇలా ఎందుకు నిర్ణయించుకున్నారో నాకు తెలియదు. కానీ మీరెక్కడ వున్నా సుఖంగా, సంతోషంగా వుండాలనే మీ స్నేహితురాలిలా కోరుకుంటాను. మీకెపుడు ఏ అవసరం వచ్చినా నన్ను గుర్తుకు తెచ్చుకోండి. మీ కోసం నా ప్రాణమైనా ఇచ్చి మీ రుణం తీర్చుకుంటాను" అంది.

నానించి స్నేహం తప్ప మరేమీ ఆశించని—నా సుఖం, నా సంతోషం తప్ప మరేమీ కాంక్షించని ఈ స్త్రీతో జీవితం తప్పకుండా సుఖంగా వుంటుంది.

సీత ఆశ్చర్యపోయి చూస్తుండగా బాబుని ఎత్తుకుని భుజం మీద వేసుకున్నాను.

మరో చేత్తో సూట్ కేస్ పట్టుకున్నాను.

ఆరింటికి హైదరాబాద్ వెళ్ళే రైలుంది. ఆరు కావడానికింకా అరగంట టైం వుంది.

బైటికి నడిచి సీతకోసం కొంత సేపు నిలబడ్డాను.

ఆ తర్వాత స్టేషన్ వైపు నడుస్తుంటే నా వెనక నన్ను అనుసరిస్తూ నా అడుగుల్లో అడుగులు వేస్తూ సీత అడుగుల సవ్వడి మెత్తగా హాయిగా విన్పిస్తోంది నాకు. ■